

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

ఆవారా హూ
యా గర్‌దిశ్ మే హూ ఆస్మాన్ క తారా హూ.

'ఆవారా' సినిమాలోని ఈ పాట తెలియని వారుండరు. మన దేశంలోనే కాదు ప్రపంచంలోని పలు దేశాలలో భారతీయ సినిమాకు పర్యాయపదంగా నిలుస్తుందీ పాట. ప్రపంచ దేశాధినేతలందరితో 'ఆవారాహూ' అనిపించిన పాట ఇది.

పాటలు లేని సినిమాలను భరించటం కష్టం. పాటలులేని సినిమాలను చూస్తున్నప్పుడు ఒకోసారి ఇక్కడో పాట ఉంటే ఎంత బాగుండేది అనిపిస్తుంది. పాటలు మన సినిమాలను ఆకర్షణీయం చేయటమే కాదు మన సినీ నటీ నటులకు 'గుర్తింపు' నిస్తాయి. విదేశీ నటుల గురించి, సినీ కళాకారుల గురించి మాట్లాడేటప్పుడు సినిమా పేర్లు చెప్పుకుంటూ, 'అద్భుతమైన నటన' అని చర్చించుకుంటాం. కానీ భారతీయ సినీ కళాకారుల గురించి చర్చించేటప్పుడు సినిమాలలో వాళ్లపై చిత్రీకరించిన పాటలను ప్రస్తావించుకుంటాం. ఆనంద పరవశులమౌతాం. అయితే, మన సినిమాలలో పాటల కోసం కొన్ని ప్రత్యేకమైన సన్నివేశాలను, stock సన్నివేశాలను మనవాళ్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటిల్లో పాత్రలు, ముఖ్యంగా నాయకుడి పరిచయం పాట ఒకటి.

ఈ పరిచయం పాటల ప్రత్యేకత ఏమిటంటే, నాయకుడు తెరపైకి వస్తూనే పాటతో వస్తాడు. ఆ పాటలో నాయకుడి వ్యక్తిత్వం ప్రేక్షకులకు పరిచయం అవుతుంది. అంటే నాయకుడి వ్యక్తిత్వాన్ని ఎస్టాబ్లిష్ చేసేందుకు మనకు ప్రత్యేక సన్నివేశాలు అవసరం లేదన్నమాట. నాయకుడు వస్తూనే తన గురించి పాట పాడుకుంటూ రావచ్చు. లేకపోతే ఏదో ఓ సన్నివేశంలో తన వ్యక్తిత్వాన్ని ప్రకటిస్తూ పాట పాడవచ్చు.

'ఆవారా' సినిమాతో మన సినిమాల్లో నాయకుడి వ్యక్తిత్వాన్ని ప్రకటించే పాటల సంప్రదాయం ఆరంభమయింది. అంతకు ముందు ఇంత స్పష్టంగా నాయకుడు తన గురించి చెప్పుకునే పాటలు అరుదుగా ఉండేవి. కానీ 'ఆవారాహూ' పాట సూపర్ హిట్ అవటంతో ఇదొక సంప్రదాయంగా మారింది. 'ఆవారా' పాట రూపొందించిన విధానం సినీ రంగంలో అత్యంత ప్రధాన పాత్ర వహించే 'యాదృచ్ఛికం' ప్రభావాన్ని ప్రదర్శిస్తుంది.

రాజ్‌కపూర్‌కు కవి శైలేంద్ర పాటలు రాసే విధానం నచ్చింది. శైలేంద్రను కవి అనేకన్నా స్వాభావిక గేయ రచయిత అనవచ్చు. కానీ శైలేంద్ర అప్పుడు రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. తన 'కళ' అమ్మకానికి కాదు అన్న విశ్వాసంతో ఉన్నవాడు. అతనికి తొలి సంతానం కలిగినపుడు డబ్బు అవసరమైంది. రాజ్‌కపూర్ సహాయం చేశాడు. బదులుగా 'బర్సాత్ ' సినిమాలో రెండు పాటలు రాశాడు. మరో సినిమాలో రామన్టే 'ఇచ్చిన డబ్బుకు సరిపడా పాటలు ఇచ్చేశాను. చెల్లుకు చెల్లు ' అన్నాడు. అయితే రాజ్‌కపూర్ అంత త్వరగా ఉత్తమ కళాకారుడిని వదలడు. కె.ఎ.అబ్బాస్ 'ఆవారా ' కథ వినిపించే సమయంలో శైలేంద్రను వెంటపెట్టుకుని వెళ్లాడు. రెండున్నర గంటల సేపు అబ్బాస్ 'ఆవారా ' కథను రాజ్‌కపూర్‌కు వినిపించాడు. మామూలు దుస్తులతో సామాన్యుడిలా ఉన్న శైలేంద్రను అతను పట్టించుకోలేదు. కథంతా అయిన తరువాత, రాజ్‌కపూర్ శైలేంద్ర వైపు తిరిగి 'ఎలా ఉంది కథ?' అనడిగాడు.

శైలేంద్ర సమాధానంగా 'ఆవారాథా  మగర్ గర్ దిశ్‌మే ఆస్మాన్ కా తారా థా' అన్నాడు. అబ్బాస్ ఆశ్చర్యానికి అంతులేదు. తాను కష్టపడి రెండున్నర గంటలసేపు వినిపించిన కథాసారాన్ని రెండు ముక్కలలో చెప్పేశాడీ వ్యక్తి. 'ఎవరీయన?' అని అప్పుడు రాజ్‌కపూర్‌ని అడిగాడు. 'శైలేంద్ర, ఆవారా గేయరచయిత ' అని రాజ్‌కపూర్ శైలేంద్రను పరిచయం చేశాడు. అలా 'ఆవార ' టైటిల్ సాంగ్ ఆవిర్భవించింది.

శైలేంద్ర ప్రత్యేకత ఏమీటంటే అతను కథాసారాన్ని, పాత్ర వ్యక్తిత్వాన్ని నిర్దిష్టంగా, నిక్కచ్చిగా, అతి తక్కువ పదాలతో పాటలలో ప్రదర్శిస్తాడు. అందుకే రాజ్‌కపూర్ సినిమాల్లో అతని వ్యక్తిత్వాన్ని పరిచయం చేసే అధిక శాతం పాటలను శైలేంద్ర రాశాడు. శైలేంద్ర రచనా శైలిలో క్లుప్తత ఎంతగా ఉంటుందో స్పష్టత అంతే ఎక్కువగా ఉంటుంది. సినీగేయ రచయితలలో అధిక శాతం రచయితల్లా ఆయన ఉపమానాలు వాడడు. అలంకారాలు వాడడు. చెప్పదలచుకున్న అంశాన్ని స్పష్టంగా, సూటిగా, నిజాయితీగా, చెప్తాడు. అదీ ఎలాంటి సందేహాలకు, ప్రశ్నలకు తావులేకుండా ఒక statementలా matter of fact లా చెప్తాడు. అందుకే శైలేంద్ర పాటలు అనేకం quatations గా వాడతారు. అతని పాటల్లో పదాలు అనేక సినిమా పేర్లలా వాడుకున్నారు.

ఆవారా సినిమా nature v/s narture అన్న సంఘర్షణను ప్రదర్శిస్తుంది.  ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని పుట్టుక నిర్దేశిస్తుందా? పెరిగిన వాతావరణం నిర్దేశిస్తుందా? అన్న సంఘర్షణ సినిమా కేంద్రబిందువు. ఒక జడ్జి అనుమానంతో గర్భవతి అయిన భార్యను ఇంటినుంచి తరిమివేస్తాడు. ఆమెకు ఒక దొంగ ఆశ్రయమిస్తాడు. అంటే 'పుట్టుక'తో పిల్లవాడు గొప్ప కుటుంబానికి చెందినవాడు. జడ్జి కుమారుడు. కానీ పెరిగింది మురికివాడలలో, దొంగల నడుమ. వాడు పెరిగి దొంగ అవుతాడు. ఇక సినిమా కథ మలుపులతో యాధృచ్ఛికమైన సంఘటనలతో సాగుతుంది. కానీ, 'ఆవారా'గా గుర్తింపు పొందుతున్న హీరో నిజానికి జడ్జి కుమారుడు. దాంతో వారసత్వంగా అతడికి మంచి గుణాలు అందుతాయి. కానీ పెరిగిన వాతావరణ ప్రభావం వల్ల దొంగ అయ్యాడు. ఇదీ నాయకుడి పాత్ర పరిచయం. దీన్ని శైలేంద్ర అత్యంత అద్భుతంగా పాత్ర పరిచయ గీతంలో పొదిగాడు.

**ఆవారాహూ,**

**యా, గర్ దిశే మే హూ ఆస్మాన్ క తారా హూ.**

'ఆవారా' అంటే 'అల్లరి చిల్లరిగా తిరిగేవాడు' అన్న అర్థం వస్తుంది. అంటే చదువులేనివాడు. జీవితంలో లక్ష్యం లేనివాడు. గమ్యం లేనివాడు ఇలా నెగిటివ్ అర్థంలోనే వాడతారు 'ఆవారా' అన్న పదం. నిజానికి అదొక తిట్టు. రోడ్డుమీద అల్లరి చిల్లరిగా తిరుగుతూ, వచ్చేపోయే వారిని ఏడ్పిస్తూండే వారిని 'ఆవారా' అని తిడతారు. ఇక్కడ 'ఆవారా' అనే తిట్టు పదానికి శైలేంద్ర ఇచ్చిన వివరణ పాత్ర వ్యక్తిత్వాన్ని సినిమా కథ సారాన్ని అత్యద్భుతమైన రీతిలో ప్రదర్శిస్తుంది.

'నేను ఆవారానా, లేక అంతరిక్షంలో ఆకాశంలోని తారనా?' అని అడుగుతున్నాడు హీరో. ఆకాశంలో నక్షత్రాలు కూడా గమ్యం, లక్ష్యం లేకుండా ఉంటాయి. కానీ, తారలు అత్యద్భుతమైనవి. తారలను ఉత్తమమైన వాటిని సూచించేందుకు  వాడతారు తప్ప నెగిటివ్ ధోరణిలో వాడరు. అంటే నేను ఆకాశంలోని తారను కానీ మీరు 'ఆవారా' అనుకుంటున్నారు అన్న అధిక్షేపణ ఉంది నాయకుడి పాటలో. అప్పటికి హీరోకి తాను జడ్జి కొడుకుని అని తెలియదు. కానీ తాను తారలాంటి వాడిని, ప్రజలు తన అసలు స్వభావాన్ని గుర్తించక 'ఆవారా' అని ఈసడిస్తున్నారు అన్న భావం వస్తుంది పల్లవి లోనే. ఇదీ శైలేంద్ర గేయ రచన సంవిధానం పల్లవిలోనే సినిమా లక్ష్యం, సారం, పాత్ర పరిచయం అన్నీ అయిపోయాయి. ఇక పాటలో పైన చెప్పి అంశాన్ని మరింతగా వివరించటం ఉంటుంది.

**ఘర్‌బార్ నహీ, సన్సార్ నహీ,**

**ముఝుసే కిసీకొ ప్యార్ నహీ**

**ముఝ్ కో కిసీసే ప్యార్ నహీ**

**సున్సాన్ నగర్ అంజాన్ డగర్ కా ప్యారా హూ**

**ఆవారాహూ.**

ఇల్లూ వాకిలి లేదు, తన వారంటూ ఎవరూ లేరు, తననెవరూ ప్రేమించరు, తనకు ఎవరిమీద ప్రేమలేదు అంటూ 'తన గురించి టూకీగా చెప్పుకున్న తరువాత 'సున్సాన్ నగర్ అంజాన్ డగర్' అంటే 'పరిచయం లేని దారి'. అవి అతడిని ఇష్టపడతాయన్నమాట. అంటే అందరూ వెళ్లే దారి అతనిది కాదు. అందరూ ఉండే నగరాలు అతనివి కావు. అంటే అందరికన్నా భిన్నం అన్నమాట అతను. ఎందుకంటే అతను ఆవారాగా గుర్తింపు పొందిన తార కాబట్టి.

**ఆబాద్ నహీ, బర్బాద్ సహీ**

**గాతాహూ ఖుషీ కే గీత్ మగర్**

**జఖ్మోం సె భరా, సీనా హై మెరా**

**హస్తీ హై మగర్ యే మస్త్ నజర్**

అతడికి సుఖం అవసరం లేదు. అది లేకున్నా దుఃఖం విషాధాలయినా ఫరవాలేదు. ఏది లభించినా సంతోషకరమైన పాటలు పాడుతూంటాడు. అతని హృదయం గాయాల మయం. అయినా నవ్వుతూ, ఆనందిస్తూనే ఉంటాడు. ఇదీ నాయకుడి పరిచయం అయితే, ఇంతటితో వదిలేస్తే అది శైలేంద్ర గీతం కానేకాదు.

**దునియా, మై తెరె తీర్కా**

**యా తక్దీర్ క మారా హూ...**

**ఆవారాహూ...**

'పంచ్‌లైన్' అన్నమాట. తనకు ఎవరూ లేరు. ఎవరూ తనవారు కారు అని చెప్తూ, సుఖమైనా, దుఃఖమైనా సంతోషంగా ఉంటానని చెప్తూ, అసలైన దెబ్బ కొట్టాడు. ప్రపంచమా.. నన్ను దెబ్బ తిసిందెవరు? నువ్వా? అదృష్టమా? అని అడుగుతున్నాడు. nature v/s narture పుట్టుక, పెంపకం ఏది మనిషిని తీర్చిదిద్దుతుంది అన్న దానికి అత్యద్భుతమైన రీతిలో వ్యక్తపరచాడు శైలేంద్ర. ఆకాశంలో తార ఆవారాగా గుర్తింపు పొందటానికి కారణం ఎవరు? ఈ ప్రపంచమా? అదృష్టమా?

ఇదీ శైలేంద్ర గేయ రచన సంవిధానం. ఎక్కడా కఠినమైన పదం లేదు. కఠినమైన భావం లేదు. సులభంగా అర్ధమైపోతుంది. కానీ తరచి చూస్తే అత్యంత లోతైన భావాలు, ఆలోచనల గనులు కనిపిస్తాయి శైలేంద్ర గేయాల్లో. అందుకే శైలేంద్ర, సాహిర్ లూథియాన్వీకి దీటుగా నిలవటమే కాదు తన సత్‌ప్రవర్తనతో సాహిర్ కన్నా ఎక్కువ గౌరవాన్ని, డిమాండ్‌ని సాధించేవాడు. గమనిస్తే, సాహిర్ లానే శైలేంద్ర కూడా అధికశాతం పాటలు తన గురించే రాసుకున్నాడు. అనేక పాటలలో తన అభిప్రాయాలనే వ్యక్తపరిచాడు. సాహిర్‌లానే పాటలు సినీ సందర్భ పరిధిలో ఒదిగినా, అవి సినీ పరిధిని దాటి సార్వజనీనతను సాధించాయి. ప్రతి వ్యక్తి అంతరంగ స్పందనల స్వరంగా ఎదుగుతాయి.

'శ్రీ 420' సినిమాలో రాజ్‌కపూర్ పరిచయ గీతం దాదాపుగా 'జాతీయ గీతం' స్థాయికి ఎదిగింది. ఈ నాటికీ భారతీయ సామాజిక మనస్తత్వాన్ని సూచించేందుకు వాడటం కనిపిస్తుంది. 'శ్రీ 420' సినిమాలో హీరో అమాయకుడు. పల్లెనుంచి జీవిక కోసం పట్నానికి వస్తూంటాడు. అదీ ఎలా వస్తాడు? పాట పాడుతూ. ఏం పాటపాడతాడు? శైలేంద్ర రచించిన గీతం.

**మేరా జూతా హై జాపానీ**

**యే పత్లూన్ ఇంగ్లిష్‌స్తాన్**

**సర్‌పె లాల్ టోపీ రూసి**

ఇప్పుడు వస్తుంది, ఈ పాటను జాతీయ మనస్తత్వాన్ని ప్రతిబింబించే గీతంలా మలచిన 'పంచ్‌లైన్ '

**ఫిర్‌భీ దిల్ హై హిందుస్తానీ.**

అతని చెప్పులు జపాన్‌కు చెందినవి. అతని ప్యాంట్ ఇంగ్లీషు వాళ్లది. తలమీద టోపీ రష్యాది. కానీ హృదయం మాత్రం భారతీయం. అంటే మనం అందరినీ ఆహ్వానిస్తాం. అన్నిటినీ స్వీకరిస్తాం. అందరినీ ఆదరించి మనవారిగా చేసుకుంటాం. కానీ మన ప్రత్యేకత మాత్రం నిలుపుకుంటాం. ఈ ఆలోచనకే 'జిస్ దేశ్‌మె గంగా బహతే హై'లో, 'హోటోంపె సచ్చాయీ రహతీ హై' పాటలో అత్యంత సుందరంగా వివరిస్తాడు శైలేంద్ర.

**జో జిన్‌సెమిలా సీఖా హం కే**

**గైరోంకోభీ అప్నాయా హంనె**

**మతలబ్ కె లియే అంధే హోకర్**

**రోటీకో నహీ పూజా హం నే.**

ఎవరి దగ్గర ఏది దొరికితే దాన్ని గ్రహించాం. నేర్చుకున్నాం. పరాయివారిని, అపరిచితులను కూడా స్వంతవారిగా చేసుకున్నాం. స్వార్ధం, లోభాల ప్రలోభంలో పడి భౌతిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. 'రోటీ కో నహీ పూజా' అంటే 'తిండిని పూజించిలేదు' అన్నది సామాన్యార్ధం. ఇక్కడ తిండిని పూజించటం కాదు అసలు అర్ధం. 'మల్ లచ్ కెలియే అంధ హోకర్ ' అంటే స్వార్ధం ప్రలోభంలో గ్రుడ్డివాడయి భౌతిక సుఖలాలసలో పడలేదు అన్నది అర్ధం. అంటే ఎన్ని ప్రలోభాలున్న, ఎవరిని మనలో కలుపుకున్న మనం మనమే అన్నమాట. 'ఫిర్ భీ దిల్ హై హిందుస్తానీ'. హృదయం మాత్రం భారతీయమే.

**నికల్ పడే హై ఖులీ సడక్ పర్**

**అప్‌నా సీనా తానే**

**మంజిల్ కహా కహా రు కనా హై**

**ఊపర్ వాలా జానే**

**చల్‌నా జీవన్‌కీ కహానీ**

**రుక్‌నా మౌత్‌కీ నిషానీ**

శైలేంద్ర గేయ రచన సంవిదానంలో గమనించాల్సిన మరో అంశం ఇది. ఆయన గేయరచనలో అత్యంత ఆధ్యాత్మిక భావనలు ప్రదర్శిస్తాడు అతి సరళంగా. అనేక జీవిత సత్యాలను అలవోకగా పాటలో భాగం చేస్తాడు.

శ్రీ 420 సినిమాలో నాయకుడు పల్లెనుంచి పట్టణం బయలుదేరాడు. దాన్ని శైలేంద్ర 'ఎంతో ధైర్యంగా, గుండె నిబ్బరంతో రోడ్డు పైకి వచ్చాను' అనిపించాడు నాయకుడు. అంటే, శైలేంద్ర పాటలలో వర్ణనలు, వివరణలు ఉండవు. సూటిగా చెప్పాల్సిన అంశాన్ని చెప్పటం ఉంటుంది. అందుకే నాయకుడు తన గమ్యం వైపు ధైర్యంగా ప్రయాణం ఆరంభించాడని చెప్తూ 'ఎవరెవరిని ఎక్కడ ఆపాలో అది భగవంతుడికే తెలుసు అనిపిస్తాడు. అంటే మనం ఒక లక్ష్యంతో బయలుదేరతాం. కానీ మనం గమ్యం ఏమిటో, ఎక్కడ ఆగుతుందో మనకు తెలియదు. ప్రయత్నం చేయటమే మన పని. గమ్యం నిర్ణయించటం భగవంతుడి పని. అందుకే 'ముందుకు సాగటం జీవిత కథ. ఆగిపోవటం మరణానికి ప్రతీక' అనిపిస్తాడు. ఈ చరణంలో 'మంజిల్ కహా కహా' నుంచి 'మౌత్ కీ నిషానీ' వరకూ సార్వజనీన సత్యం. జీవిత సత్యం. 'కర్మణ్యేయాధికారస్తే' లో భగవద్గీత శ్లోకానికి సరళమైన తాత్పర్యం. ఇలాంటి గేయ రచనవల్ల పాట ప్రభావం సినిమా పరిధి దాటుతుంది. శ్రోతల ఎదలలో స్థిరపడి అలరిస్తుంది. జీవితాంతం స్ఫూర్తినిచ్చే గీతంలా నిలుస్తుంది.

ఊపర్ నీచే నీచే ఊపర్
లహర్ చలే జీవన్ కా
నాదాన్ హై జో బైఠ్ కినారే
పూఛే, రాహ్ వతన్ కీ
బఢ్ తీ జయే హం సైలానీ
జైసే ఎక్ దరియా యేసానీ

ఇక్కడ ఆరంభంలోనే జీవిత సత్యం చెప్పేస్తున్నాడు. పైకి క్రిందకూ వెళ్తాయి జీవిత తరంగాలు అని. అంటే జీవితం స్థిరంగా ఉండదు. మనుషుల అదృష్టాలు మారుతూంటాయి. ఓడలు బళ్ళు అవుతాయి. బళ్ళు ఓడలవుతాయి. ఇలాంటి నిత్య చంచల శీలి అయిన ప్రపంచంలో సాగరం అలలపై తేలి ఆడకుండా ఒడ్డున కూర్చుని 'ఎటుపోతున్నాం' అని అడిగేవాడు అమాయకుడు. జీవిత సముద్రంలో దూకాలి. ఎగిరే అలతో పోరాడాలి. విరిగే అలతో విరగాలి. అయినా ముందుకు సాగుతూనే ఉండాలి.

సినిమాలో నాయకుడు దారిద్ర్యం నుంచి అత్యంత వైభవానికి ఎదుగుతాడు. అరువాత అన్నీ విడిచి పెడతాడు. ముందుకు సాగుతాడు.

ఇది శైలేంద్ర గేయ రచన పద్ధతి. అయితే శైలేంద్ర అధిక శాతం పాటలు సంగీత దర్శకులు శంకర్ జై కిషన్‌కు రాశారు. ఇది శైలేంద్ర రచనా సంవిధానంలో మరో గొప్ప కోణాన్ని ప్రదర్శిస్తుంది.

శంకర్ జై కిషన్‌లు గేయ రచయితకు స్వేచ్ఛ నివ్వరు. ముందుగా వారు ఆకర్షణీయమైన బాణీని సృజిస్తారు. ఆ బాణీకి తగ్గట్టు పదాలు మార్చటం గేయ రచయిత బాధ్యత. ఆపై ఆ పాటను ఇక పెళ్లి కూతురిని అలంకరించినట్టు అలంకరిస్తారు ఆర్కెస్ట్రాతో శంకర్‌జైకిషన్. 'ఆవారా హూ' పాటలో పదాలు ఎంత గొప్పగా ఉంటాయో, బాణీ అంత తేలికయినది కానీ పాటకు ముందు వచ్చే అకార్డియన్ వాదం కానీ పాటలో 'ఆవారాహూ' అనగానే వచ్చిన సంగీతం కానీ, నడుమ వచ్చిన సంగీతం కానీ పాటను అద్భుతమైన స్థాయికి ఎదిగిస్తుంది. 'శ్రీ 420 ' పాటలోని 'మేరా జూతా హై ఓ పానీ'లో కూడా ఇదే గమనించవచ్చు. బాణీ చాలా తేలికయినది. పదాలు తేలికయినవి. భావం బరువైంది. ఆర్కెస్ట్రా అద్భుతమైనది. పాటకు ముందు వచ్చి ప్రిల్యూడ్ సంగీతం పాట ఊపును పెంచుతుంది. పాటను వినటం మరపురాని అనుభూతిగా మలుస్తుంది. అయితే ఈ బాణీలన్న ముందు తయారయినవి. వాటికి పదాలు శైలేంద్ర తరువాత కూర్చాడు. కానీ పాటలు వింటూంటే ఈ గేయ రచయిత పదాల కోసం తడుముకున్నట్టు కానీ, భావం కుదరక ఇబ్బంది పడ్డట్టు కానీ అనిపించదు. బాణీ ప్రవాహంతో అడుగు కదిపి నడుస్తాయి పదాలు. దాంతో ఒక Constructiv interference జరిగి అల మరింత ఎత్తుకు ఎదిగినట్టు పాట విలువ మరింత పెరుగుతుంది. అయితే బాణీ తేలికతనం గ్రహించిన శైలేంద్ర 'శంకర్ జై కిషన్ ' సంగీత దర్శకత్వంలో రాసిన పాటలలో సందర్భ పరిధిని దాటి జీవిత సత్యాలు ప్రకటించాడు. ఆధ్యాత్మికతను ప్రదర్శించాడు. అదే ఇతర సంగీత దర్శకులకు ఆయన సందర్భాన్ని బట్టి పాట రచించాడు తప్ప సందర్భ పరిధిలో లేని జీవిత సత్యాలను ప్రకటించలేదు. అందుకే శైలేంద్ర మరణం తరువాత,మరో సరైన గేయ రచయిత శంకర్ జై కిషన్‌కు లభించలేదు. వారి అదృష్టం దిగజారటం ఆరంభమయింది.

*(మరిన్ని మధురమైన గీతాలలో వచ్చే నెల)*

Post your comments